# బార్ మెయిడ్

-ఆదెళ్ళ శివకుమార్



ఒళ్ళంతా చెమటతో తడిచి ముద్దముద్దయి పోవడంతో నేను బెడ్ మీంచి లేచి కూర్చున్నాను.

నిజానికి కళ్ళు ఇంకా నిద్రతో బరువుగానే వున్నాయి. కానీ విపరీతంగా ఉక్కపోస్తూండటం వల్ల నిద్ర కూడా పట్టడం లేదు.

రాత్రి చాలా సేపటి దాకా మేల్కొని వుండటమే కాక విపరీతంగా తిరిగినందువల్ల ఒళ్ళంతా ఒకటే నొప్పులు, గడియారం చూశాను. పన్నెండు గంటల పదిహేను నిమిషాలయింది. మేము గోరేగావ్ ( వెస్ట్)లోని ఒక చౌకబారు హోటల్‌లో దిగాం. హోటల్ వాళ్ళు పగలు పన్నెండు తర్వాత కరెంటు తీసేస్తున్నారు. లాడ్జిలో వున్నవాళ్ళు పగటిపూట హాయిగా పడుకోవడం వాళ్ళకు ఎంతమాత్రం ఇష్టంలేనట్టుగా వుంది. పక్కకు తిరిగి చూశాను. నా మిత్రుడు పక్కనున్న బెడ్డుమీద బోర్లా పడుకుని ఉక్కపోత కారణంగా ఆపసోపాలు పడుతున్నాడు. రాత్రి పరిచయమైన విచిత్రమైన కొత్త యువకుడు పరుపు కింద వేసుకుని గురక పెడుతూ ఆదమరిచి నిద్రపోతున్నాడు. ఈ కొత్త యువకుడు రాత్రి మూడు గంటలకు బొంబాయిలో మాకు ఒక కొత్త అనుభవాన్ని రుచి చూపించాడు. మా రూములో పడుకున్న నాలుగో వ్యక్తి డ్రైవరు. అతను లేచి పోయి డ్యూటీకి ఎప్పుడు వెళ్ళాడో మాకు తెలియనే తెలియదు.

నేను నా మిత్రుణ్ణి నిద్ర లేపటానికి ప్రయత్నించాను. అతను ఏదో గొణిగాడు.

'లే నాయనా, పన్నెండు అయింది' అన్నాను.

అతను బొంబాయి ఫక్కీలో టైము తల్లిని ఉద్దేశించి దుర్భాషలాడి రెండో పక్కకి ఒత్తిగిలి పడుకున్నాడు. తిట్లకు కూడా ఒక ప్రత్యేకత అనేది వుంటుంది. వాతావరణం మారిపోతే మనిషి నోట్లోంచి వెలువడే తిట్లు కూడా మారిపోతాయి. మేం ఢిల్లీలో తరచుగా వాడే తిట్లని మరిచిపోయి ఈ తొమ్మిది రోజుల్లోనే బొంబాయి తిట్లను అలవాటు చేసుకున్నాం. మేం అలవాటు చేసుకోవటం అవే మమ్మల్ని పట్టేశాయి. బొంబాయిలో అయిన దానికీ కానిదానికీ అన్నీ తల్లిని ఉద్దేశించిన తిట్లే.

సరే! పోనీండి, దాని సంగతి.

పంపుదగ్గరకి వెళ్ళి స్నానంచేసి వద్దామనిపించింది. స్నానంచేస్తే ఈ ఉక్కపోత ప్రభావం కొంతయినా తగ్గి కనీసం ఒక అరగంట సేపయినా హాయిగా నిద్రపడుతుందేమోనని ఆశ. నిక్కర్‌తోనే వంటి మీద టవల్ వేసుకుని ఓపెన్ ప్లేస్‌లో వున్న పంపు దగ్గరికి వెళ్ళాను. పంపుతిప్పి ఓ అయిదు నిమిషాలపాటు దానికింద కూర్చుండి పోయాను. ప్రాణం స్వర్గానికి బెత్తెడు ఎడంగా పోతూన్నంత ఆనందం, హాయి!

లేచి టవల్‌తో తలా, ఒళ్ళూ శుభ్రంగా తుడుచుకున్నాను. పక్కకి తిరిగి చూశాను. ఎడమ చేతి వేపున వున్న పంపు దగ్గర ఒక అమ్మాయి బక్కెట్టునిండా బట్టలు వేసుకుని వచ్చింది, ఉతుక్కోవడానికి. నేను ఆ అమ్మాయి ముఖంకేసి చూసి ఆశ్చర్యపోయాను. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. రెండు నిమిషాలపాటు ఆ అమ్మాయికేసి అలా చూస్తూ ఉండిపోయాను. 'ఇదెలా సంభవం!' నేను కళ్ళారా చూస్తున్న దృశ్యాన్నే ఎంతమాత్రం నమ్మలేకపోతున్నాను. రాత్రి నొప్పులు, మత్తు ఇంకా వదిలిందా లేదా అని ఒకసారి తలగట్టిగా విదిలించి చూశాను.

**ఆ అమ్మాయి తన మేక్సీ కింది భాగం నీళ్లలో తడిచిపోకుండా మడిచి రెండు కాళ్ళ మధ్య నొక్కి వుంచింది. ఛామనఛాయలో ఆమె పిక్కలు మెరుస్తున్నాయి. ఒక నల్లని గండు చీమ ఆమె మడమ మీంచి పైకి ఎగబాకుతోంది.**

– ఆమే! అనుమానం లేదు, అదే యువతి!

రెండు నిముషాలపాటు అలా ఆలోచిస్తూ వుండి పోయాను. ఆమె నన్ను అసలు ఏ మాత్రం పట్టించుకోకుండా బట్టలు ఉతుక్కుంటోంది. ఆమె ఒదులుగా వున్న స్లీవ్‌లెస్‌మెక్సీ ధరించి వుంది. ఆమె ముఖం మీద యిప్పుడు కూడా మత్తువంటిదేదో పోరాడుతూ వుంది. కానీ చాలా గంభీరంగా తన పనేదో పోరాడుతూ వుంది. తన పనేదో తాను చేసుకుపోతూ వుంది. ఆమెను పలకరించాలని మనసులో పీకుతున్నప్పటికీ ఆగంభీరవదనాన్ని చూసి సాహసించలేక పోతున్నాను. ఉన్నట్టుండి నా స్థితి నాకు గుర్తుకు వచ్చింది. నేను తడి ఒంటితో, తడిసిన నిక్కరుతో అక్కడ నిలబడ్డాను. వెంటనే స్లిప్పర్లు ఈడ్చుకుంటూ రూమ్‌లోకి వెళ్ళిపోయాను.

రూమ్‌లోకి అడుగు పెట్టడంతోనే మిత్రుణ్ణి బలవంతంగా నిద్రలేపాను.

'మిత్రమా...! విచిత్రం జరిగిపోయింది. కలో నిజమో అంతబట్టకుండా వుంది...'

'ఏమైంది! బాత్‌రూమ్‌లో ఎవరైనా అమ్మాయి నగ్నంగా స్నానం చేస్తూండగా చూశావా?' మిత్రుడు తన సహజ ధోరణిలో అడిగాడు.

'లేదు మిత్రమా! రాత్రి బార్‌లో మీకు డ్రింక్స్ సర్వ్ చేసిన అమ్మాయి లాడ్జిలో పంపుదగ్గర బట్టలు ఉతుక్కుంటోంది...' వివరంగా చెప్పాను.

'వేరే ఎవరో అమ్మాయి అయి వుంటుందితే గురూ! క్రైమ్ మేగజైన్‌లో సస్పెన్స్, రొమాన్స్ కథల్ని ఎడిట్ చేసీ చేసీ నా మైండు అలాగే తయారయిపోయింది. నా కైతే అసలు ఆ అమ్మాయి ఎలా వుందో కూడా జ్ఞాపకం లేదు. మందుకొట్టాక నాకు అమ్మాయిలంతా ఒక లాగే కనిపిస్తారు' మిత్రుడు నా మాటల్ని తేలిగ్గా కొట్టిపారేసి సిగరెట్ వెలిగించుకోసాగాడు.

'లేదు మిత్రమా! నేను పొరపాటుపడే సమస్యే లేదు. నేను చాలా జాగ్రత్తగా పరిశీలించి చూశాను. ఆమె ముక్కు ఎడమ పక్కన పెద్ద పుట్టుమచ్చ వుంది. ఆమె ఎడమ చేతిమీద 'ఎం' అని పచ్చబొట్టు చెక్కివుంది. ఇవి నిన్న రాత్రి నేను చాలా స్పష్టంగా గుర్తుంచుకున్నాను.'


'నన్నడగవేంటి? అదే అదే! రాత్రి మన దగ్గర తెగఫోజు కొట్టింది. అవతలి టేబుల్ వాళ్ళ దగ్గర మాత్రం అన్ని ఒయ్యారాలూ వలకబోసింది' రాత్రి కలిసిన కొత్త మిత్రుడు అన్నాడు. వాడు ఎప్పుడు లేచి బీడీ ముట్టించాడో నేను అసలు గుర్తించనే లేదు. రాత్రి వాడు వళ్ళు పై తెలీకుండా తాగిన తాగుడు, బీడీల వాసన వాడి నోటి నుంచి కొద్ది సేపటిలోనే గదంతా వ్యాపించింది.

'గురూ! ఇతనితో మాట్లాడు. బొంబాయిలో ఇతనికి తెలియని విషయమంటూ వుండదులా వుంది. పాపం! ఎటువంటి టాలెంట్లో వున్న వ్యక్తులు నిరుద్యోగులుగా పడివున్నారు మన దేశంలో!' మిత్రుని స్వరం కటువుగా పలికింది. నిజానికి ఈ కొత్త యువకుడు మమ్మల్ని పెట్టిన హింస అంతా ఇంతా కాదు. విపరీతంగా తాగేసిన అతను తిప్పినట్టల్లా తిరిగాం.

'ఆ అమ్మాయి ఈ లాడ్జిలోనే వుంటుందా?' ఆ యువకుణ్ణి అడిగాను.

'అవును – ఇక్కడే బాత్‌రూమ్ పక్కనే వున్న గదిలో వుంటుంది.'

నాకా మాట చాలా ఆశ్చర్యం కలిగించింది. మేము ఎనిమిది రోజుల నుంచి ఇదే లాడ్జిలో వుంటున్నాం. ఆ అమ్మాయిని ఎప్పుడూ గమనించలేదు. అయితే ఒకటి. మే ప్రొద్దస్తమానం బయట తిరుగుతూ రాత్రి బాగా పొద్దుబోయాక గానీ లాడ్జికి చేరుకోవడం లేదు. అందువల్లనే మిస్సయి వుంటాం.




బార్ మెయిడ్‌ని కలుసుకుని వాళ్ళ పరిస్థితిని గురించి తెలుసుకోవడానికి యిదో మంచి సువర్ణావకాశం అనిపించింది. అనుకోకుండా వెతకబోయిన తీగె కాళ్ళకు తగిలినట్టయింది. నేను ఎలాగయినా సరే ఆ అమ్మాయిని పరిచయం చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. బట్టలేసుకున్నాను. నీళ్ళ జగ్గు తీసుకుని నీళ్ళకోసం అన్నట్టుగా మళ్ళీ పంపుదగ్గరికి వెళ్ళాను. ఆమె పూర్తిగా బట్టలు ఉతుక్కోవడంతో మునిగిపోయి వుంది. ఆమె నిర్వికారంగా నాకేసి చూసి తిరిగి తన పనిలో లీనమయింది.

నేను పంపుదగ్గర జగ్గులో నీళ్ళు పట్టాను.



ఆమెను పలకరించటానికి నెపం కోసం వెతుక్కుంటున్నాను. ఉన్నట్టుండి అవకాశం దొరకనే దొరికింది. ఆ అమ్మాయి తన మేక్సీ కింది భాగం నీళ్ళలో తడిచిపోకుండా మడిచి రెండు కాళ్ళ మధ్య నొక్కి వుంచింది. చామన ఛాయలో ఆమె పిక్కలు మెరుస్తున్నాయి. ఒక నల్లని గండు చీమ ఆమె మడమల మీంచి పైకి ఎగబాకుతూ కనిపించింది. ఇదే తగిన సమయం అనిపించింది.

'ఎక్స్‌క్యూజ్‌మీ మేడమ్! మీ కాలి మీద గండు చీమ వుంది. కుడుతుందేమో తీసేయండి' అన్నాను.

ఆమె చూసుకుంది, రెండో కాలి వేళ్ళతోనే తొలగించి చెప్పకాలితో నిర్దాక్షిణ్యంగా నలిపివేసింది.

క్షణం పాటు నా మనసు గిలగిలలాడింది. కోమల హృదయానికి మారుపేరైన స్త్రీ యింత క్రూరంగా వ్యవహరించగలదని నేను ఆలోచించలేకపోయాను. కుట్టి బాధించడమే స్వభావంగా కలిగిన కీటకాలను నలిపేయడం న్యాయమేగదా అని తర్వాత మనసుకి సర్ది చెప్పుకున్నాను. అదేకాక బొంబాయిలో వాళ్ళు చాలా ప్రాక్టికల్‌గా వుంటారు.

చీమను నలిపేశాక ఆమె నాకేసి చూసింది. ఏదో మర్యాదకోసం అన్నట్టుగా ఆమె పెదవుల మీదికి చిన్నన వ్వు పులుముకుని 'థాంక్స్!' అంది.

ఆమెతో మాట్లాడటానికి గాను చేతి కందిన ఈ అవకాశాన్ని నేను జారవిడుచుకోదలచుకోలేదు.



"మేడమ్! మీరు నన్ను మరోలా అనుకోక పోతే మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలని అనుకుంటున్నాను? ఉద్దేశ్య పూర్వకంగానే అమాయకంగా ముఖం పెట్టి అడిగాను.

నా నోట్లోంచి ప్రశ్న వెలువడిందో లేదో ఆమె నొసలు ముడుతలు దేరింది. చేతిలో వున్న గుడ్డని పిండుతూ లేచి నిలబడింది. ఏమిట న్నట్టుగా నాకేసి చూసింది.

'రెండు రోజుల క్రితం చర్చిగేటు దగ్గరవున్న బార్‌లో డ్రింక్స్ సర్వ్ చేసింది. మీరే కదా? '

నా ప్రశ్నకు ఆమె నన్ను ఎగాదిగా చూసింది. 'తెలీదు (నహీమాలూమ్)' అనేసింది.

ఖచ్చితంగా యిదే సమాధానం వస్తుందని నేను ముందే భయపడ్డాను. ఈ బొంబాయి వాళ్ళు 'నహీమాలూమ్' అని జవాబు చెప్పే పద్ధతి చాచి లెంపకాయ కొట్టినట్టుగా వుంటుంది. నేను నిరాశ చెందలేదు.

'మీరు నన్ను అపార్థం చేసుకున్నట్టున్నారు. నాకు వేరే ఎలాంటి దురుద్దేశ్యం లేదు." నేను సంభాషణ కొనసాగించటానికి మళ్ళీ ప్రయత్నించాను.

'అవును – నేను ఆ బార్‌లో సర్వీస్ చేస్తున్నాను. కానీ నేను వృత్తి చేసేదాన్ని మాత్రం కాదు? ఆమె నా మాటల్ని పూర్తిగా వినకుండానే తన విషయం స్పష్టంగా చెప్పేసింది.

'మీరు మళ్ళీ నన్ను అపార్థం చేసుకున్నారు. నా ఉద్దేశ్యం అది ఎంత మాత్రం కాదు. మేం ఢిల్లీ నుంచి వచ్చాం. బార్‌లలో పనిచేసే అమ్మాయిల గురించి జనం రకరకాలుగా చెప్పుకుంటున్నారు. అయితే బార్‌లలో పనిచేసే అమ్మాయిలందరూ అలాంటివాళ్ళేనని అనుకోవటానికి లేదు గదా....'

'కానీ బొంబాయి వాళ్ళు మాత్రం అందర్నీ ఒకే గాటిన కట్టి చూస్తారు.'

'అవును – మీరు చెప్పేది ముమ్మాటికీ నిజం. యిక్కడ మనిషి మనసునీ, మానసిక ప్రపంచాన్నీ ఎవరూ అర్థం చేసుకోరు. డబ్బుకు అన్నీ అమ్ముడవు తాయన్నది వాళ్ళ నమ్మకం. కానీ అది అందరి విషయంలో నిజం కాదు.'

నేను ఆ అమ్మాయిని దారిలోకి మళ్ళించటానికి ప్రయత్నించాను.

'ఇక్కడ మనుషులు ఇమోషన్స్‌ని కూడా పర్సులోనే పెట్టుకుంటారు.' ఆమె నా మాటల్ని సమర్థించింది.

'నిజానికి నేను మీతో కొద్దిసేపు మీతో మాట్లాడాలను కుంటున్నాను. మీరు చాలా మర్యాదస్తురాలిగానూ, ఇమోషనల్ వ్యక్తిగానూ కనిపిస్తున్నారు. మీరు దయచేసి నా కోసం కొంత సమయాన్ని కేటాయించగలరా?'

'ఏం మాట్లాడాలను కుంటున్నారు?'

'అదే, మీ జీవితాన్ని గురించి, బార్‌లలో పనిచేసే అమ్మాయిల జీవితాల్ని గురించి, నిజానిజాలు తెలుసుకుందామని.'

'కథ ఏమైనా రాస్తారా?'


'అవును. అలాంటిదే. బట్ ఐ ప్రామిస్ యూ. మీరు ఏం చెప్తారో అది మాత్రమే రాస్తాను...'

'ఇప్పుడు నేను విశ్రాంతి తీసుకోవాలి. మూడింటికి మీరు నా గదికి రండి. నాలుగింటికి నేను డ్యూటీకి వెళ్ళి పోతాను...'

'థ్యాంక్యూ మేడమ్!' అని చెప్పి సెలవు తీసుకుని మా రూముకి వెళ్ళాను.

'అయితే నువ్వు ఆ అమ్మాయి ముఖ కవళికల్ని క్షుణ్ణంగా చదివేసి వుంటావు. ఆమె సైకాలజీని పూర్తిగా అర్థం చేసుకుని వుంటావు. నీ పని పూర్తయి పోయి వుంటుంది.' వ్యంగోక్తులు విసరటం ప్రారంభించాడు మిత్రుడు.

'ఇంకా ఏం కాలేదు, మూడింటికి కలుస్తానని మాత్రం ప్రామిస్ చేసింది.'




'బొంబాయిలో అన్నింటికన్నా సుల భమైన పని ఆడశరీరాన్ని సాధించడం. పొట్ట గడుపుకోవటానికీ, డబ్బు సంపాదించడానికి అది సహజమైన సులువు మార్గం – శరీరవ్యాపారం. బొంబాయిలోని బీర్ బార్‌లను పరిశీలిస్తే మనకు స్పష్టంగా అర్థమయ్యే అంశం యిది. ఢిల్లీలో కూడా ఇలాంటి బార్‌లు ఉన్నాయి కానీ వాటి సంఖ్య చాలా తక్కువ. అయినా అక్కడ అమ్మాయిలు సర్వ్ చేయరు. ఢిల్లీలో కేబరే హౌస్‌లున్నాయి. అక్కడ మగ వాళ్ళ వాంఛల్ని, మోహావేశాల్ని సంతృప్తి పరచేందుకు యజమానులు డాన్సర్లతో అర్థనగ్నంగానూ, పూర్తి నగ్నంగానూ

■■■

**"అవును. నేను బార్‌లో సర్వీస్ చేస్తాను. కానీ నేను వృత్తి చేసేదాన్ని మాత్రం కాదు" ఆమె స్పష్టంగా చెప్పేసింది.**

■■■

అథమస్థాయి నృత్యాలు చేయిస్తుంటారు.

ఈ విధంగా చూస్తే బొంబాయి బార్‌లలో ఏర్పాటయ్యే నృత్యాలు దీనికి పూర్తి భిన్నంగా వుంటాయి. ఇక్కడ అన్నీ ఒక పథకం ప్రకారం పద్ధతిగా జరిగి పోతుంటాయి.

పురాతన కాలంలో రాజులు, మహారాజులు లేదా పాదుషాలు దర్బారుల్లో సాఖీలు వుండేవారు. వాళ్ళు తమ స్వహస్తాలతో మధువును కలిపి పురుషుల కౌగిట్లోకి వెళ్ళి పెదవులకు మధువు అందించేవాళ్ళు. ఇవాళ రాజులూ, మహారాజులూ లేరు. పాదుషాలు అంతకన్నా లేరు. అయితే బొంబాయి మహానగరంలో మాత్రం ఈ నాటికి రాజులకి కొదవలేదు.

– మిగతా కథ వచ్చేవారం ■